## క్లుప్తంగా

### మొక్కలు నాటడంపై శ్రద్ధ చూపాలి

**గిద్దలూరు రూరల్:** మొక్కలు నాటడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకుడు మాగులూరి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని సంజీవరాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

### సీపీఐ వార్షికోత్సవం



మాట్లాడుతున్న దేవండ్ల రామయ్య

**పెద్దారవీడు:** మండలంలోని హనుమాన్ జంక్షన్ కుంటలో సీపీఐ ఆధ్వర్యంలో 99వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్ తొలుత సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభవాన్ని ఎదుర్కొంటోందని చెప్పారు. త్రిపురాంతకం మండల సీపీఐ కార్యదర్శి బానాల రామయ్య, మూఠా కార్మికులు కన్నెబోయిన శ్రీను, ఈర్ల రామయ్య, పిన్నిక శ్రీను, ఉప్పలపాటి సాగర్, పగడాల సుబ్బయ్య, ఆర్.లోకనాథ్ పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల్లో వసతులపై పరిశీలన

**సీఎస్‌పురం(పామూరు):** పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనున్న దృష్ట్యా మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను సెక్టార్ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అంబవరం, కొత్తపల్లి, చెన్నపునాయునిపల్లి, వి.బైలు, అయ్యలూరివారిపల్లె కేంద్రాలను సెక్టార్ ఆఫీసర్ రాజాల కొండారెడ్డి, శీలంవారిపల్లి, ఆనికాలపల్లి, నల్లమడుగుల, గుంతచెన్నంపల్లి, పుల్లగూరపల్లి, ఉప్పలపాడు పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారి జి.సంజీవి పరిశీలించారు. డీజీపేట, బోయమడుగుల, వెంకటాయచెరువు, కొండబోయినపల్లి పోలింగ్ కేంద్రాలను సెక్టార్ అధికారి ఆర్.శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి వసతి, ఫర్నీచర్, ర్యాంపులు, ప్రహరీలు వంటి సదుపాయాలు ఉన్నాయా, లేదా అనే అంశాలను పరిశీలించినట్లు సెక్టార్ అధికారులు తెలిపారు. ర్యాంపుల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సదుపాయాలను ఎస్ఎఎంఎఫ్ నిధులను వినియోగించి వెంటనే ఏర్పాటు చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మరో 10 రోజుల్లో మరోమారు కేంద్రాలను తనిఖీచేస్తామని వారు పేర్కొన్నారు.

### ఈవీఎంలపై అవగాహన

**లింగసముద్రం:** మండల కేంద్రమైన లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద మంగళవారం ఈఎంలతో మాక్‌పోలింగ్ నిర్వహించారు. వివిధ పార్టీల రాజకీయ నాయకులకు ఈవీఎం పనితీరుపై తహసీల్దార్ టి.ప్రసాద్ అవగాహన కల్పించారు. ఓటు వేసిన వ్యక్తి తమ ఓటు ఎవరికి వేశామని స్క్రీన్ మీద కనిపించే దృశ్యాలను డెమో ద్వారా రాజకీయ నాయకులకు చూపించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈవీఎంలతో మాక్‌పోలింగ్ నిర్వహించి అవగాహన కల్పించడం వలన రాజకీయ నాయకుల్లో అబద్రతాభావం తొలగిపోతుందన్నారు.

### ఎంపీ సహకారంతో రోడ్ల మరమ్మతులు

**టంగుటూరు:** మండలంలోని కందులూరు గ్రామంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సమకూర్చిన పొక్లెయిన్‌తో జంగిల్ క్లియరెన్స్, చెత్త తొలగింపును మంగళవారం ప్రారంభించారు. చెరువుకొమ్ముపాలెం డొంకకు ఇరువైపులా చిల్లచెట్లను తొలగించి, గ్రామంలో ఉన్న అన్ని పొలాల డొంకలను జిల్లా గొర్రెల పెంపకందారుల చైర్మన్ బొట్ల రామారావు ఆర్థిక సహకారంతో బాగు చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. బొట్ల సుబ్బారావు, ఎంపీటీసీ అరితోటి దొరబాబు, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, పసుమర్తి సుప్రియ, బాబు, మనోజ్, బొడ్డు వేణు, భాను, బాబులు, చిరమని వేణు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**పీసీపల్లి:** మండలంలోని పెదయిర్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్వయం కృషి సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ పోలం లక్ష్మీ దేవి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లి దండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం సంస్థ సభ్యులు షేక్ నాయబ్ రసూల్‌ను స్కూల్ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ సుభాన్, విద్యాకమిటీ చైర్మన్ సూరా మాల్యాద్రి, ఎంపీటీసీ మైల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకే మెరుగైన వైద్య సేవలు



కంభం: మందులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



మెడికల్ క్యాంపునకు హాజరైన ప్రజలు

**కురిచేడు:** ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని బోధనంపాడులో సర్పంచ్ వేమా శివ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమాన్ని సర్పంచ్ వేమా శివ ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ గతంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన స్పందనను చూసి ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి రెండోసారి కూడా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించారన్నారు. అనంతరం కళ్ల జోళ్లు, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యబీమా కార్డులను ఆయన సర్పంచ్ శివతో కలిసి పంపిణీ చేశారు. ఎంపీడీఓ కుసుమకుమారి, వైద్యాధికారి ప్రవీణ్, వ్యవసాయాధికారి మధుబాబు, ఏపీఎం జాన్ సైమన్, కేవీకే శాస్త్రవేత్త శివ, డాక్టర్లు కేవీ నాగరాజు, వై. మౌనిక, రవితేజ, బీజేఎస్ హెరాల్డ్, మరియదాసు, వి. ఆంజనేయులు, సుబ్బరామయ్య, పి.కాశయ్య, బీజేపీ నియోజకవర్గ నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**దొనకొండ:** గ్రామాల్లోని ప్రజలకు నిరంతరం సేవలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని రుద్రసముద్రంలో మంగళవారం 2వ విడత జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డీపీఓ పాల్గొని ప్రజలకు అందించే వైద్య సేవలను పరిశీలించారు. అధికారులకు సూచనలు, సలహాలందించారు. వైద్యాధికారి ఎం.సునీత పర్యవేక్షణలో వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**బేస్తవారిపేట:** స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో జగనన్న సురక్ష మెడికల్ క్యాంపు మంగళవారం నిర్వహించారు. 590 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు పృధ్వీరాజ్, వర్షిణి, స్పెషలిస్ట్ డాక్టర్ పి. సమర్ కుమార్, కంటి వైద్య నిపుణుడు ఇమ్మడి వెంకటేశ్వర్లు వైద్య పరీక్షలు చేశారు. ఆర్థోకు సంబంధించి ఐదుగురికి శస్త్రచికిత్సలు అవసరమవుతున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పార్వతి, పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**తాళ్లూరు (ముండ్లమూరు):** మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం-2ను విజయవంతం చేయాలని వైద్యాధికారి ఖాదర్‌మస్తాన్‌బీ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఈ నెల 5వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు జరిగే జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమాలను సిబ్బంది సమన్వయంతో పని చేసి రోగులకు సేవలందించాలన్నారు. అందుకోసం గ్రామాల వారీగా షెడ్యూల్ ప్రకటించి అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీపీఎంఓ సుబ్బారెడ్డి, వైద్యాధికారి రాజేష్‌యాదవ్, సిబ్బంది ప్రమీల, కోటేశ్వరి, రవికుమార్ పాల్గొన్నారు.

**కొనకనమిట్ల:** ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి, సొసైటీ చైర్మన్ కామసాని వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నాగరాజుకుంట గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సురక్ష కార్యక్రమాన్ని ఎంపీటీసీ కామసాని భారతి శేషిరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యులు బాలయ్య, సురేఖ, గైనకాలజిస్టులు, ఆప్తమాలజిస్ట్ పాల్గొని 300 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.



వైద్య సేవలను పరిశీలిస్తున్న డీపీఓ



ఆరోగ్య బీమా కార్డులు అందజేస్తున్న సర్పంచ్ శివ, జెడ్పీటీసీ నాగిరెడ్డి

**కంభం:** జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా గ్రామీణ స్థాయిలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతున్నాయని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అన్నారు. మండలంలోని ఎల్‌కోటలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం కార్యక్రమం నిర్వహించారు. స్పెషలిస్టు వైద్యులు వైద్యశిబిరంలో పాల్గొని రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మహబూబ్ బాషా, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, ఎంపీడీఓ ప్రసాద్‌బాబు, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.



నాగరాజుకుంటలో..



మాధవరంలో ఓ కుటుంబం సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బూచేపల్లి

# కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి బలం

- పలు గ్రామాల్లో బూచేపల్లి పర్యటన
- పలువురికి ఆర్థిక సాయం

**తాళ్లూరు (ముండ్లమూరు):** వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే కొండంత అండ అని.. వారిని అన్ని విధాలా ఆదుకుంటామని దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలను కలిసి వారిని పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శివరామపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ సీనియర్ నాయకుడు రామ్మూర్తిని పరామర్శించి యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాధవరంలో కొడిమెల వెంకటరావు కుమారులను పరామర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన వైద్య సేవల గురించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి దృష్టికి తీసుకెళ్లి వైద్య సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. వైద్య ఖర్చులకు రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సోము శివారెడ్డి తల్లి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. మానసిక అంగవైక్యం గల మహిళకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అంగవైకల్యంగల కొడిమెల సుబ్బయ్య తనకు మూడు చక్రాల బండి కావాలని కోరగా వెంటనే పంపిస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీలు మధుసూదన్‌రెడ్డి, రామిరెడ్డి, మోషే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఐవీ సుబ్బారెడ్డి, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి జక్కుల రామకృష్ణ, ఎంపీటీసీలు యోహాన్, ప్రభుదాసు పాల్గొన్నారు.

# నేడు మంత్రి సురేష్ పర్యటన



మంత్రి సురేష్ ప్రారంభించనున్న స్త్రీ శక్తి భవన్ ఇదే..

**యర్రగొండపాలెం:** రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం యర్రగొండపాలెంలో విస్తృతంగా పర్యటించనున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన స్త్రీ శక్తి భవనాన్ని, విశ్వనాథం వీధిలో వేసిన సీసీ రోడ్డు, సైడ్ కాలువలను మంత్రి ప్రారంభిస్తారు. స్థానిక పుల్లలచెరువు రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపం వద్ద కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ నూతన భవన నిర్మాణానికి, త్రిపురాంతకం రోడ్డులోని మార్కెట్ యార్డు ఆవరణలో గోడౌన్‌ల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేస్తారని ఆయన తెలిపారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రాం ఆడిటోరియంలో జరిగే పెన్షన్ కార్యక్రమంలో మంత్రి సురేష్ పాల్గొంటారని ఆయన వివరించారు.

# ప్రజాప్రతినిధులు, అధికారులకు సన్మానం

**దొనకొండ:** నూతన సంవత్సరం సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఎంపీపీ బొరిగొర్ల ఉషా మురళి, డీపీఓ జీవీ నారాయణరెడ్డి, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్‌లను వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది శాలువాలు, బొకేలతో సన్మానం చేశారు. డీపీఓ నారాయణరెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు చక్కగా విధులు నిర్వహించాలని, పారిశుధ్య కార్మికులు గ్రామాలను పరిశుభ్రంగా ఉండేలా పని చేయాలని డీపీఓ తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు పి.కృష్ణమూర్తి, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డీపీఓను సన్మానిస్తున్న వలంటీర్లు, కార్యదర్శులు

# ఉత్సాహంగా ఆడుదాం–ఆంధ్ర పోటీలు



బేస్తవారిపేట: ఖోఖో ఆడుతున్న యువకులు



ముండ్లమూరు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ శంకరరావు

**ముండ్లమూరు:** మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఆడుదాం..ఆంధ్రా ఆటల పోటీల్లో గ్రామీణ ప్రాంత క్రీడాకారులు ఉత్సాహంగా.. ఉల్లాసంగా పాల్గొంటున్నారని ఎంపీడీఓ కె.శంకరరావు తెలిపారు. మండలంలోని శంకరాపురం, ముండ్లమూరు గ్రామాల్లో జరుగుతున్న ఆడుదాం..ఆంధ్రా ఆటల పోటీలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడాకారులలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఐదు రకాల ఆటల పోటీలు నిర్వహిస్తోందన్నారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని సచివాయ సిబ్బంది పోటీలను నిర్వహించడంతో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. క్రికెట్ పోటీలు పీఈటీ భవన్నారాయణ పర్యవేక్షణలో జరిగాయి.

**బేస్తవారిపేట:** మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో యువతీ, యువకులు పాల్గొన్నారు. పిటికాయగుళ్ల, బేస్తవారిపేట జెడ్పీ హైస్కూళ్ల ఆవరణలో జరిగే పోటీలను ఎంపీడీఓ పార్వతి, పూసలపాడులో జరిగే పోటీలను తహసీల్దార్ డీవీబీ వరకుమార్ పరిశీలించారు.

# తెలంగాణ ఓటర్లకు అవకాశం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న ఇస్మాయిల్, రవిచంద్ర

- సబ్ కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ నేతల విజ్ఞప్తి

**మార్కాపురం:** తెలంగాణ రాష్ట్రంలో ఓటు హక్కు కలిగిన వారికి ఆంధ్రప్రదేశ్‌లో ఓటేసే అవకాశం కల్పించవద్దని, డబుల్ ఓట్ల తొలగింపునకు తగిన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ రాహుల్‌మీనాకు మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర కోరారు. మంగళవారం సాయంత్రం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొందరు ఓటర్లు తెలంగాణాలో నివాసముంటూ మార్కాపురంలో ఓటు నమోదు చేయించుకున్నారని, డబుల్ ఓటర్లను తొలగించాలని కోరారు. సంచారజాతుల వారికి కూడా ఓటు హక్కు కల్పించాలని వారు గత కొన్నేళ్లుగా మార్కాపురం పట్టణంలో నివసిస్తున్నారని, ఆధార్ కార్డు ఓటరు కార్డుతో అనుసంధానం కాకపోవడంతో ఓటు హక్కును తొలగించేందుకు సిద్ధమవుతున్నారని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. డబుల్ ఎంట్రీ ఓటర్లను గుర్తించే పనిలో ఉన్నామని, అలాంటి వారందరికీ నోటీసులు ఇచ్చామని తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు తాళ్లపల్లి సత్యనారాయణ, షేక్ మౌలాలి, అందె నాసరయ్య, సుదర్శన్, డి.చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వారసత్వ సంస్కృతిని భావితరాలకు తెలపాలి

**మార్కాపురం:** మన వారసత్వ, సంస్కృతి సంపదను ముందు తరాలకు తెలపాల్సిన బాధ్యత కవులపై ఉందని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాల సుబ్బారావు, విశ్రాంత డీవైఈఓ మల్లికార్జునరావు పేర్కొన్నారు. మంగళవారం విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశంలో మన ఊర్ల కథలు పుస్తకాన్ని రచించిన డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డిని ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. పశ్చిమ ప్రకాశంలో ప్రసిద్ధ గ్రామాల చరిత్రను ప్రజలకు అర్థమయ్యేరీతిలో రచించి పుస్తక రూపంలో విడుదల చేయడం అభినందనీయమన్నారు. రచయిత వీరారెడ్డి మాట్లాడుతూ.. ఈ పుస్తకాలను పాఠశాలలకు అందిస్తున్నానన్నారు. అనంతరం కొత్త ఇన్‌కం టాక్స్ విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత డీవైఈఓ సాయిలీల, రిటైర్డు ప్రిన్సిపాల్స్ వెంకటరెడ్డి, రామిరెడ్డి, నారాయణరెడ్డి, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీరారెడ్డిని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు

### ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

**ఉలవపాడు:** ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలో జాతీయరహదారి పై ఉలవపాడు ఉత్తర బైపాస్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు.. ఉలవపాడు కుచెందిన మొగిలి శ్రీను, చెంచయ్యలు ఉలవపాడు కు ద్విచక్రవాహనం పై వస్తున్న సమయంలో ఉలవపాడు నుండివీరేపల్లికి వెళుతున్న మరో ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీను, చెంచయ్యలు గాయాలయ్యాయి.

### కో ఆపరేటివ్ బ్యాంక్ స్థలం ఆక్రమణ



బలిజ సంఘం భవనం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి

**గిద్దలూరు రూరల్:** కో ఆపరేటివ్ బ్యాంక్ స్థలం ఆక్రమణకు గురైనట్లు పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బ్యాంక్‌కు చెందిన స్థలంలో బలిజ సంఘం భవనం నిర్మాణం చేసిందని, సదరు స్థలాన్ని ఆయన తన సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. 1976లో ప్రభుత్వం 8 సెంట్లు, 1977లో మునగనూరి సత్యనారాయణ 5 సెంట్ల స్థలాన్ని బ్యాంక్‌కు ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. బలిజ సంఘం నాయకులు మాత్రం బ్యాంక్ స్థలం పక్కన ఉందని, ఇది రుద్రభూమిగా సర్వేయర్ తమకు చెప్పడంతో తాము బలిజ సంఘం భవనం నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు నిర్ధారణ చేయాల్సి ఉంటుంది.

# బీఎల్ఏలను నియమించాలి

**దర్శి:** నియోజకవర్గంలోని 282 పోలింగ్‌స్టేషన్లకు సంబంధించి బీఎల్ఏలను నియమించాలని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఓటర్లందరికీ ఈవీఎం, వీవీ పాట్‌ల పనిచేసే విధానంపై అవగాహన, సందేహాల నివృత్తి కోసం షెడ్యూల్ ప్రకటించారు. షెడ్యూల్ ప్రతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ నెల 12వ తేదీన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. తుది జాబితాను ఈ నెల 22న ప్రచురించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు పురుషులు 112470, స్త్రీలు 110447, ఇతరులు 10, మొత్తం 222927 ఉన్నట్లు తెలిపారు.



పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తున్న ఈఆర్ఓ లోకేశ్వరరావు

### 14 మద్యం బాటిళ్లు స్వాధీనం

**మార్కాపురం టౌన్:** పట్టణంలోని రాజ్యలక్ష్మి కాలనీలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి 14 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com